క్లుప్తంగా

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మాడుగుల్లో గ్రంథాలయ సభ్యులు

మునగపాక: అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని మాడుగుల్లో గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి ధనశ్రీను అన్నారు. యూపీ స్కూల్ నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు రాణి, నానాజీతో పాటు సీఆర్‌పీ అచ్యుతకృష్ణలను మాడుగుల్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ధనశ్రీను మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని, విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి మరువలేమన్నారు. గ్రంథాలయ కార్యదర్శి యల్లపు సంజీవరావు, ఉపాధ్యక్షుడు ఆడారి అప్పలనాయుడు, హెచ్‌ఎం రాజేశ్వరరావు, గ్రంథాలయ ప్రోత్సాహకులు భీశెట్టి రామలక్ష్మి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు

మునగపాక: మండలంలోని రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలను అందజేస్తున్నామని నాగులాపల్లి పశు వైద్యాధికారి మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. జొన్న 100 కిలోలు, మొక్కజొన్న 200 కిలోలు, బొబ్బర్లు 350 కిలోల వంతున అందుబాటులో ఉన్నాయన్నారు. జొన్న 5 కిలోల బ్యాగ్ అసలు ధర రూ.460 కాగా.. రాయితీ రూ.345 పోగా, రైతు తన వాటాగా రూ.115 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మొక్కజొన్న 5 కిలోల బ్యాగ్ అసలు ధర రూ.340 కాగా, రూ.255 రాయితీ పోను రైతు తన వాటాగా రూ.85 చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. బొబ్బర్లు 3 కిలోల బ్యాగ్ అసలు ధర రూ.295.5 కాగా రూ.222 రాయితీ పోగా రైతు తన వాటాగా రూ.73.8 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మౌనిక కోరారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో శుక్రవారం సాయంత్రం ఆమె పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శనివారం ప్రతి పంచాయతీలో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల చోరీపై ఫిర్యాదు



వ్యవసాయ పరికరాల చోరీపై ఫిర్యాదు చేస్తున్న రైతులు

మునగపాక: మునగపాకలో వ్యవసాయ పరికరాల చోరీపై శుక్రవారం పలువురు రైతులు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆడారి దానయ్య ఇస్తువ ప్రాంతంలోని పశువుల పాకల్లో ఉంచిన గునపాలు, కత్తులు, పారలు, కొడవళ్లు వంటి సామాగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 17న అపహరించుకుపోయారంటూ రైతులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆడారి గోవిందప్పారావు, ఆడారి రమణబాబు, భీశెట్టి సూరప్పారావు, వేగి రమణబాబు, వేగి సత్యనారాయణ, వేగి గంగ సూరప్పారావు, ఆడారి సూరిబాబు, ఆడారి నరసింగరావు తదితరులున్నారు.

గోతులో కూరుకుపోయిన టిప్పర్



పిల్లర్ గోతులో కూరుకుపోయిన టిప్పర్ లారీ

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం కూడలిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం టిప్పర్ లారీ పిల్లర్ కోసం తీసిన గోతులో ఒక్కసారిగా కూరుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

భయపెడుతున్న గాలికుంటు

- సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం
- అప్రమత్తంగా వ్యవహరిస్తే మేలు
- టీకాతోనే వ్యాధి నివారణ సాధ్యం
- గ్రామాల్లో నెల రోజుల పాటు టీకాలు



మునగపాకలోని ప్రభుత్వ పశువైద్య శాల



పాడిగేదెకు టీకా వేస్తున్న దృశ్యం

మునగపాక: అన్నదాతలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే ప్రస్తుత రోజుల్లో వ్యవసాయంతో పాటు పశు పోషణ తప్పనిసరి. అయితే సీజనల్‌లో వచ్చే వ్యాధులు పాడి పరిశ్రమను భయపెడుతున్నాయి. వర్షాకాలంలో పశువులకు అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. తద్వారా పశువుల్లో పాల దిగుబడులు తగ్గిపోతుంటాయి. దుక్కి పశువుల సామర్థ్యం తగ్గిపోవడం, పెయ్యిలు ఎదకు రాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ప్రధానంగా పశువులను గాలికుంటు వ్యాధి నిత్యం భయపెడుతోంది. ఇటువంటి నేపథ్యంలో వర్షాకాలంలో పశువులకు సోకే వివిధ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యులు పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

వర్షా కాలంలో గాలికుంటు వ్యాధి ముప్పు

వర్షాకాలంలో పశువులకు ప్రదానంగా గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉంటుంది. దీంతో పాల దిగుబడి తగ్గిపోతుంది. ఇందుకోసం పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ నెల 15వ తేదీ నుంచి టీకాల కార్యక్రమం ప్రారంభించారు. నెల రోజుల పాటు పశువైద్యులు గ్రామాల్లోని పశువుల వద్దకు వెళ్లి గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసేలా ప్రణాళికలు రూపొందించారు. టీకాల కార్యక్రమం మండల వ్యాప్తంగా శతశాతం జరిగేలా చర్యలు చేపట్టారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

- తీవ్ర జ్వరం, నీరసం
- కొద్దిపాటి ఎండకు సైతం పశువుల్లో అలసట
- దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గడం
- పాలు తాగే దూడల్లో మరణాలు
- చికిత్స విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే పశువుల మృతికి అవకాశం

ప్రయోజనాలు

- వ్యాధి సోకిన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తి పెంచవచ్చు
- వ్యాధి సోకిన దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం పెంపు
- దూడల్లో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదుగుదలకు దోహదం
- పశువుల గుర్తింపునకు చెవికి పోగు వేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి

టోల్ ఫ్రీ నంబరు 1962

పశువులకు సీజన్‌లో వచ్చే అంటువ్యాధుల సమస్యలను నివృత్తి చేసేందుకు వీలుగా జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా 1962 టోల్ ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా గాలికుంటు వ్యాధి సమస్యకు సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా ఫోన్ చేసేందుకు అవకాశం కల్పించారు.

తప్పనిసరిగా టీకా వేయాలి



గాలికుంటు వ్యాధి నివారణకు టీకా ఒక్కటే మార్గం వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ. ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. టీకాలు వేయడం ద్వారా గణనీయంగా పాల ఉత్పత్తి పెరగడం, ఆరోగ్యకర ఇబ్బందులు ఉండవు. నెల రోజుల పాటు గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం జరుగుతుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్, గణేష్, పశుసంవర్ధక శాఖ ఏడీ

పులపర్తి ఎరువుల దుకాణంలో తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..



పులపర్తి వెంకట సత్యనారాయణ ట్రేడర్స్‌లో స్టాకు తనిఖీ చేస్తున్న ఏవో మోహన్‌రావు

యలమంచిలి రూరల్: పులపర్తిలోని వెంకట సత్యనారాయణ ట్రేడర్స్ ప్రైవేటు దుకాణంలో మండల వ్యవసాయాధికారి పాలిమేర మోహన్‌రావు శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ దుకాణంలో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న విషయంపై సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు ఆదేశాలతో దుకాణానికి వెళ్లి గోదాములో నిల్వ ఉన్న స్టాకును పరిశీలించారు. సుమారు 200 మెట్రిక్ టన్నుల వరకు ఈ దుకాణంలో యూరియా విక్రయించినట్టు ఏవో గుర్తించారు. యూరియా ఎవరెవరికి విక్రయించారో బిల్లులు, రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని తెలుసుకున్న ఏవో మూడు రోజుల్లోగా వివరాలు తమ కార్యాలయానికి అందజేయాలని గడువు ఇచ్చారు. విక్రయించిన సరకు ఏదైనా అందుకు తగిన రసీదు కొనుగోలుదారులకు అందజేయాలని, ఇలాంటి ఫిర్యాదులొస్తే లైసెన్సు రద్దు చేస్తామని దుకాణ యజమానిని హెచ్చరించారు. మండలంలో యూరియా అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు చేపడుతున్నామని ఏవో సాక్షికి తెలిపారు. యూరియా అమ్మకాలను ఎక్కువగా రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూరియాకు సంబంధించి రైతులకు సందేహాలుంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

రూ.2 లక్షల బీమా చెక్ అందజేత



పాములవాకలో చెక్ అందజేస్తున్న మేనేజర్

కోటవురట్ల: పాములవాక గ్రామంలో గ్రామీణ వికాస్ బ్యాంకు ద్వారా మృతుని కుటుంబ సభ్యులకు బీమా చెక్‌ను శుక్రవారం అందజేశారు. గ్రామీణ వికాస్ బ్యాంకు ఖాతాదారు అయిన రుత్తల రమణ కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. దాంతో అతని భార్య రుత్తల లోవకొండతల్లికి రూ.2 లక్షల బీమా చెక్‌ను బ్యాంకు మేనేజర్ కె.ఓబులునాయుడు అందజేశారు. మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూలపేటలో మౌలిక వసతుల కల్పనకు కృషి



కుళాయిల ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మూలపేట గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. మూలపేటలో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా అభయాంజనేయ స్వామి గుడి నుంచి కొయిలాడ లక్ష్మీబాయి ఇంటి వరకు, అక్కడి నుంచి భీశెట్టి మురళి ఇంటి వరకు కుళాయిల ఏర్పాటుకు ఆయన శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలపేట పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, వార్డు సభ్యులు యల్లపు హైమావతినాయుడు, భీశెట్టి నారాయణమూర్తి, ఆడారి సత్యనారాయణ, ఆడారి సన్యాసినాయుడు, మొల్లేటి గోవిందరావు, యల్లపు రాజేశ్వరరావు, భీశెట్టి నాగేశ్వరరావు, శరగడం నాగేశ్వరరావు, ఆడారి జగన్నాథరావు పాల్గొన్నారు.

‘ప్రాణాలు తీసే కంపెనీ మాకొద్దు’



మూడో రోజు నిరసన తెలుపుతున్న గుర్రాజుపేట గ్రామస్తులు

ఎస్.రాయవరం: బల్క్ డ్రగ్ నిర్మాణ పనులు ఆపాలని గుర్రాజుపేట గ్రామంలో నిర్వాసిత రైతులు మూడో రోజు శుక్రవారం కూడా నిరసన తెలిపారు. ప్రాణాలు తీసే కంపెనీ తమకొద్దని నినాదాలు చేశారు. సమాచారం లేకుండా తమ భూములను రెవెన్యూ అధికారులు సర్వే చేసినప్పటి నుంచి అడ్డుకుంటున్నా అధికారులు ఎందుకు వినడం లేదని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు నక్కపల్లి మండలం రాజయ్యపేట మత్స్యకారులతో కలిసి ఆందోళన చేస్తామని గుర్రాజుపేట గ్రామస్తులు హెచ్చరించారు.

‘చలో మెడికల్ కాలేజీ’ నిరసనకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాజీ ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి నిరసన తెలుపుతున్న అచ్యుతాపురం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



మునగపాక నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

మునగపాక: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ నర్సీపట్నంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన ‘చలో మెడికల్ కాలేజీ’ నిరసన కార్యక్రమానికి మునగపాక మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బొడ్డేడ క్యాంపు కార్యాలయం వద్ద విలేకరులతో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని చూడడం విచారకరమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రైవేటుపరం కాకుండా మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు బొడ్డేడ లిల్లి, రామకృష్ణ, మళ్ల కృష్ణ, పోలారపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : నర్సీపట్నంలో జరిగిన ‘చలో మెడికల్ కాలేజీ’ నిరసన కార్యక్రమానికి మద్దతుగా కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు సియ్యాద్రి బుజ్జి ఆధ్వర్యంలో మండల నాయకులు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తో కలిసి అక్కడ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నమరాజు రవీంద్రరాజు, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు రావి శోభనబాబు, మండల యూత్ అధ్యక్షుడు కారుకుండి గంగూలి శ్రీను, చిప్పాడ సర్పంచ్ రాజాన నాయుడు బాబు, బండారు రమణ, నడిపింటి శేఖర్, దూళి వెంకి, అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

భీమిలి డైట్ లెక్చరర్ల ఆకస్మిక సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న డైట్ లెక్చరర్

అచ్యుతాపురం రూరల్ : భీమిలి డైట్ లెక్చరర్లు మండలంలో మడుతూరు, దోసురు పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. మడుతూరు ఎంపీపీఎస్, జెడ్పీహెచ్‌ఎస్, దోసూరు ఎంపీపీఎస్, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం, బోధన, నోట్ పుస్తకాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ బి.సునీత, కె.శాంతి, ఆర్.సుబ్బలక్ష్మి, ఎం.ఎ.ఆశ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన ర్యాలీ



పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాయకరావుపేట: రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.జగదీష్ డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలకు శాపంగా మారిన జీవో నంబర్లు 107, 108ను రద్దు చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ విద్యా రంగం సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవీన్, రాజు, సింహాద్రి, పవన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ లారీ పట్టివేత

నక్కపల్లి: మండలంలో నెల్లిపూడిలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని పట్టుకున్నట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపి తరలిస్తున్న లారీని పట్టుకుని తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

ఆకట్టుకున్న ‘కంటే కూతురినే కనాలి’ నాటిక



కంటే కూతురునే కనాలి నాటికలోని ఓ సన్నివేశం

మునగపాక: స్థానిక రామాలయం ఆవరణలో గురువారం రాత్రి ప్రదర్శించిన ‘కంటే కూతురునే కనాలి’సాంఘిక నాటిక అందరినీ ఆకట్టుకుంది. మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా పాటిదిబ్బకు చెందిన శ్రీలక్ష్మీ యూనియన్ కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు. ఈ నాటికను దాడి జగన్నాథరావు రచన అందించగా దాడి ముసిలినాయుడు దర్శకత్వం వహించారు. కళాభిమానులు భారీగా తరలివచ్చి నాటికను తిలకించారు. అనంతరం రంగ స్థల దర్శకుడు దాడి ముసిలినాయుడును పలువురు పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, కళాకారులు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట శివాజీ, ఆడారి కాశీబాబు, ఆడారి సూర్యచంద్రరావు, దాడి అప్పలనాయుడు, కేపీ రావు, టెక్కలి పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెడుగుడు విజేత వాడ్రాపల్లి



చెడుగుడు విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న డాన్ జిమ్ అధినేత విజయ్

మునగపాక: మునగపాకలో సంతబయిల రామాలయం వద్ద మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు గురువారం అర్ధరాత్రి ముగిశాయి. శరగడం కుమార్ జ్ఞాపకార్థం జూనియర్ హైటెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వాడ్రాపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో జంపపాలెం జట్టు, తృతీయ స్థానంలో సోమలింగపాలెం జట్టు, నాలుగో స్థానంలో మడకపాలెం జట్టు నిలిచాయి. విజేతలకు స్థానిక డాన్‌జిమ్ అధినేత పెంటకోట విజయ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విల్లూరి నాయుడు, కాండ్రేగుల మణికంఠ, ఆడారి వెంకటేష్, దొడ్డి సాయి, టెక్కలి శివగణేష్, కర్రి శ్రీను, టెక్కలి యోగి, విల్లూరి రామ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు



కోటవురట్లలో సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న దస్తావేజు లేఖరులు

కోటవురట్ల: సమస్యల పరిష్కారం కోసం దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ చేపట్టారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు స్థానిక దస్తావేజు లేఖరులు రెండు రోజుల పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు తమ సమస్యలను వివరిస్తూ సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రైం–2.0 సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాల కారణంగా ఇబ్బంది పడుతున్నామని, అంతేకాకుండా ఆన్‌లైన్‌లో దస్తావేజు ఎడిటింగ్ ఆప్షన్‌ను తీసేయడం, కక్షిదారులను ఓటీపీలు అడగడం, స్లాట్ బుకింగ్ వంటి సమస్యలతో తీవ్ర జాప్యం జరుగుతోందని లేఖర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

స్తంభించిన సేవలు

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం నుంచి రెండురోజులు పెన్‌డౌన్‌కు దిగారు. యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో సేవలందిస్తున్న దస్తావేజు లేఖరులంతా కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ 2.0లో ఆధార్ ఓటీపీ విధానంతో ఇటు కక్షిదారులు, అటు డాక్యుమెంట్ రైటర్లు ఇబ్బందులు పడుతున్నామని రైటర్లు వాపోయారు. ఈ విధానంలో కొనుగోలుదారులు నాలుగు సార్లు, విక్రయించేవారు మూడు సార్లు ఓటీపీ చెప్పాల్సి వస్తోందన్నారు. సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాల కారణంగా కక్షిదారులు ఓటీపీలు చెప్పడానికి సంకోచించి నిరాకరిస్తున్నారన్నారు. అదే విధంగా ఓటీపీలు చెప్పిన వారికి కూడా పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఆధార్ ఆధారిత ఓటీపీ సెల్‌ఫోన్‌కు వచ్చేలోపు టైమ్ అవుట్ అవుతుండడంతో మళ్లీ మొదటి నుంచి రావాల్సి వస్తోందని రైటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కూడా నిరసనలో భాగంగా పెన్‌డౌన్ ఉంటుందన్నారు. దస్తావేజు లేఖర్లు నిరసనకు దిగి సేవలు నిలిపివేయడంతో నిత్యం రద్దీగా ఉండే యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఖాళీగా కనిపించింది. ఈ కార్యక్రమంలో శానాపతి రాము, పిల్లా నాగేశ్వర్రావు, శెలంశెట్టి నాగశేషు, శెలంశెట్టి సూర్యప్రకాష్, అర్లె ఉమ, పంచదార్ల సురేష్, రావి నూకరాజు, పంచదార్ల లక్ష్మణ, గగనం రమేష్, ఓగిబోయిన శ్రీనివాసరావు, ఐతా శ్రీనివాసరావు, చంబకాయల లోవరాజు, గల్లా వెంకట నాగేశ్వర్రావు, కొఠారు శ్రీరాములునాయుడు, పిట్టా ఆనంద్, దాసరి నానాజీ, అప్పికొండ లోకేష్, ఆళ్ల సోమునాయుడు, తమ్మిశెట్టి జయలక్ష్మి, షేక్ ఖాసీమ్, పిళ్లా స్వామి, సీత రమణ పాల్గొన్నారు.

నక్కపల్లి: స్థానిక దస్తావేజు లేఖర్లు నిర్వహించిన పెన్‌డౌన్ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానంతో కక్షిదారులు, దస్తావేజ్ లేఖర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్షుడు దాతారం మురళీ కృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎం.అప్పలరాజు, దస్తావేజు లేఖర్లు రమణ బాబు, కుమార్, నూకరాజు, సూర్యనారాయణ, ఉపేంద్ర పాల్గొన్నారు.



నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీసం, తదితరులు

చీమలాపల్లి ఆయుష్మాన్ మందిర్ తనిఖీ



చీమలాపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్స్ బృందం సభ్యులు

అచ్యుతాపురం: హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని చీమలాపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్స్ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎస్.మణికంఠ ఆధ్వర్యంలో రికార్డులను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. పరికరాలను వినియోగిస్తున్న తీరు, అందుతున్న సేవలపై ఆరా తీశారు. క్లినిక్ నిర్వహణ గురించి అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. ఎన్సీడీపీ సర్వే ఎలా జరుగుతుందని సిబ్బందిని ప్రశ్నించారు. వైద్యాధికారి షకీనాజాయ్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేశ్, వైద్య సిబ్బంది గాయత్రి, జ్యోతి, వెంకటలక్ష్మి, సుధ, రమ్య, వరలక్ష్మి, దేవుడమ్మ, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

మునగపాక: బాలికలు, మహిళలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి వై.రామకృష్ణ కోరారు. మండలంలోని మెలిపాకలో శుక్రవారం స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలికలకు అవగాహన సదస్సుతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్, కౌమార ఆరోగ్యం, టీబీ స్క్రీనింగ్, ప్రసూతి ఆరోగ్య సేవలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని మహిళలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. సర్పంచ్ అయినంపూడి విజయ భాస్కరరాజు, కె.రాజశేఖర్, మాధవరావు, గుంట్ల అప్పారావు, పంచాయతీ కార్యదర్శి శుభ శేఖర్, డాక్టర్ తరణి, ఆరోగ్య విస్తరణ అధికారి గుర్రం శ్రీనివాసరావు, హెచ్‌వీ భేగం, వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ఆరంభంలోనే అంతం చేయాలి

అచ్యుతాపురం రూరల్ : క్యాన్సర్ వ్యాధిని ఆరంభంలోనే అంతం చేసుకోవాలని వైద్యాధికారి లిఖిత అన్నారు. శుక్రవారం దోసూరు గ్రామంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు క్యాన్సర్ వ్యాధి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్మాల సుజాత రామకృష్ణ, అష్టమాలజి వెంకటలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ వరలక్ష్మి, పీహెచ్‌ఎన్ వరలక్ష్మి, హెచ్‌వీ రాజేశ్వరి, ఆరోగ్య సహాయకులు లండా అప్పలకొండ, ఏఎన్ఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

ఎస్.రాయవరం: సర్వసిద్ధి పీహెచ్‌సీలో వైద్యాధికారి ఎస్.వాసంతి 250 మంది రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: బోడపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 163 మంది మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, నోటి క్యాన్సర్ తదితర వ్యాధులపై పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో వేములపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుమ, సర్పంచ్ సింగంపల్లి ఎరుకునాయుడు, ఎంపీహెచ్‌ఈవో సిహెచ్.నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్లు బల్లి బాబు, రుక్మిణి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.